ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

శనివారం 8 జూన్ 2024



గత ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యంతోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీ నష్టం 7లో..

మరమ్మతులకు నోచుకోని నీటి శుద్ధి కేంద్రాలు 8లో..



రైతు బంధా..? రైతు భరోసానా?

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందేనా..

- స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రకటించింది. అందులో భాగంగా ప్రకటించిన రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తుందా, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని అమలుచేస్తుందా అనే అంశం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఇప్పటికే జిల్లా రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యింది. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు. ఆగస్టు 15వ తేదీలోపు 2 లక్షల రూపాయల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముక్కోటి దేవుళ్ల సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ రుణాలు మాఫీ అయ్యే వరకు బ్యాంకుల్లో, సహకార సంఘాల్లో పంట రుణాలు పొందే పరిస్థితి లేదు. ఈలోపు పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని, అందులో రైతుభరోసా పథకం ఒకటి అని ప్రకటించింది. ఈ పథకం కింద ఒక్కో ఎకరానికి రెండు సీజన్లకు కలిపి రైతులు, కౌలు రౌతులకు 15వేల రూపాయలు, రైతు కూలీలకు ఏడాదికి 12వేల రూపాయలు అందజేస్తామని ప్రకటించింది. ఈ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గడిచిన యాసంగి సీజన్ నుంచే రైతు భరోసా పథకాన్ని అమలుచేస్తుందని ఎదురుచూశారు. కానీ గత ప్రభుత్వం అమల్లో ఉన్న రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి 5 వేల రూపాయల చొప్పున ఇచ్చే సాయాన్ని మాత్రమే అందజేసింది. ఆ లెక్కన జిల్లాలో 1,48,775 మంది రైతులకు 136 కోట్ల రూపాయలను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడు మాసాల పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో కొత్త పథకాలను అమల్లోకి తీసుకవచ్చే పరిస్థితి లేదు. గురువారం నాటితో కోడ్ ముగిసింది. దీంతో రైతులు ప్రభుత్వం వంక చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం కింద ఒక్కో ఎకరానికి 5 వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి 10 వేలు ఇచ్చారు. పట్టా భూమి కలిగిన వారందరికీ పెట్టుబడి సాయాన్ని అందించడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఈ సీజన్ నుంచే ఎకరానికి 7,500 రూపాయల చొప్పున రైతుభరోసా పథకం కింద ఇవ్వాలని రైతులు, కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ పథకాన్ని ఈ సీజన్ నుంచే అమలుచేస్తారా, వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తారా అనే విషయమై స్పష్టత లేదు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం వలే గాకుండా విధివిధానాలను మార్చి రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. పెట్టుబడి సాయం చేసే విషయమై సీలింగ్ విధించే అవకాశాలున్నాయి. ఇప్పటివరకు పథకం అమలు కోసం ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించ లేదు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో వెంటనే ప్రభుత్వం స్పందించి త్వరగా మార్గదర్శకాలను రూపొందించి రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని అందించాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.

రైతు భరోసాను అమలు చేయాలి

- బేరం కుమార్, కౌలు రైతు, ఓదెల



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా పథకం కింద కౌలు రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని ఈ సీజన్ నుంచే అమలు చేయాలి. గతంలో ఎరువు బస్తాలకు సబ్సిడీ ఉండేది. కానీ ఏ ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రస్తుతం అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. గత ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోలేదు. కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తామని ప్రకటించడంతో సంతోషించాం.పట్టాదారులకు కౌలు ఇచ్చి, పెట్టుబడులు పెట్టి శ్రమించినా మాకు ఏమి మిగలడం లేదు. ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ఇచ్చి ఆదుకోవాలి.

రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలి

- దర్శనాల రాజనర్సు, కాల్వశ్రీరాంపూర్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. తనకున్న 2 ఎకరాలతో పాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నాను. కౌలు చేయడం వల్ల ఒక్కోసారి ప్రకృతి సహకరించక పెట్టుబడులు కూడా దక్కడం లేదు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు ప్రతి ఏటా పెరుగుతుండడంతో తదనుగుణంగా పంటల ధరలు పెరగడం లేదు. వ్యవసాయం చేయాలంటేనే వెనక్కి తగ్గే పరిస్థితి. ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతుభరోసా పథకం మాలో భరోసాను నింపింది. ఆ పథకాన్ని ఈ సీజన్ నుంచే అమలుచేసి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలి.

కౌలు సేద్యం గిట్టుబాటు కావడంలేదు..

- మేకల రవి కౌలు రైతు, ఓదెల



ప్రతి ఏటా కౌలు ధరలు పెరుగుతున్నాయి. ఎకరం భూమికి రెండు సీజన్లకు కలిపి 20 నుంచి 22 వేల రూపాయలు పట్టాదారుకు చెల్లించాల్సి వస్తున్నది. కౌలుతో పాటు పెట్టుబడులు పెట్టి పంటలు పండించడం వల్ల పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు ఏమి వర్తించవు. బ్యాంకుల్లో కనీసం రుణాలు ఇచ్చే వాళ్లు ఉండరు. అప్పులు చేసి పెట్టుబడులు తీసుకరావాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన రైతుభరోసా పథకం ద్వారా ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని రెండు సీజన్లకు కలిపి 15 వేలు ఈ సీజన్ నుంచే ఇచ్చి కౌలు రైతులకు ఆదుకోవాలి.

గ్రూప్-1 అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలి : కలెక్టర్

పెద్దపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అనుమతి ఉంటుందని, తర్వాత అనుమతించరని, ఈ విషయాన్ని గమనించి అభ్యర్థులు పరీక్షకు ఒక గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు వెంట ఒరిజినల్ హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ వ్యాలిడిటి ఫొటో గుర్తింపుకార్డు తీసుకొని రావాలని సూచించారు. 9:30గంటల నుంచి బయోమెట్రిక్ ప్రారంభిస్తామని, అభ్యర్థులు బయోమెట్రిక్ వేయకుండా పరీక్షా కేంద్రం వదిలివెళ్లరాదని, అభ్యర్థులు చేతి వేళ్లపై ఎలాంటి మెహందీ, టాటూలు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లే ముందు హాల్ టికెట్ పై పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను తప్పనిసరిగా అతికించాలని, ఫోటో 3 నెలలలోపు దిగినదే అయి ఉండాలన్నారు. హాల్ టికెట్‌పై ఫొటో అతికించకపోతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని, ఈ నిబంధనను హాల్‌టికెట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. జిల్లాలో 14పరీక్షా కేంద్రాల్లో 6098 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపనున్నందున అభ్యర్థులు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్‌లు, చేతి గడియారాలు వెంట తీసుకరావద్దని, కేంద్రంలోకి వెళ్లిన అభ్యర్థి పరీక్షా సమయం ముగిసే వరకు పరీక్షా కేంద్రం వదిలి వెళ్లుటకు అనుమతించరని తెలిపారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, జూన్ 7: పట్టణంలోని హనుమంతునిపేట, చందపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను శుక్రవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందజేస్తామన్నారు. ఈ డబుల్ బెడ్రూంలు ఉన్న ప్రాంతాల్లో తాగునీటి, కరెంటు, డ్రైనేజీ, రోడ్డు తదితర మౌలిక వసతులు కల్పించడంలో సమస్యలు ఉండడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలు లేకుండా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. వెంటనే పూర్తిస్థాయిలో పనులు అన్నీ పూర్తిచేసి అర్హులైన పేద కుటుంబాలకు ఇండ్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, విద్యుత్ అధికారులు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ మెగా లోకాదలత్

పెద్దపల్లిటౌన్, జూన్ 7: జాతీయ మెగా లోక్ అదాలత్ శనివారం నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ కుదుర్చబడే కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించబడుతాయన్నారు. ఉదయం 10గంటల నుంచి నుంచి జిల్లా కోర్టులో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

10న కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం

పెద్దపల్లిటౌన్, జూన్ 7: లోక్‌సభ సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఈనెల 10న సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉండడం వలన ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేసినట్లు, ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసినందున తిరిగి ఈ ఈనెల 10న సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ప్రజావాణిలో అర్జీలను అందించాలని కలెక్టర్ తెలిపారు.

12న మంథని మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మంథని, జూన్ 7: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 12న తమ కార్యాలయంలో ఎంపీపీ కొండ శంకర్ ఆధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పూర్ణచందర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖ ప్రగతిపై, ప్రజాసమస్యలపై చర్చించే ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖ అధికారులు నివేదికలతో, ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బీసీ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

మంథని, జూన్ 7: మున్సిపాలిటీ పరిధిలో బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ శుక్రవారం కమిషనర్ గుట్టల మల్లికార్జునస్వామికి వినతిపత్రం ఇచ్చారు. గతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని వినతి పత్రాలు ఇచ్చినా స్పందించలేదన్నారు. భవన నిర్మాణం కోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రూ.5 లక్షలు మంజూరు చేసినప్పటికి స్థలం కేటాయించని కారణంగా నిధులు వృథాగా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్పందించి అధిక సంఖ్యలో ఉన్న బీసీ సామాజిక వర్గాల కోసం నిర్మించే కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, ప్రసాద్, రాంమూర్తిలు పాల్గొన్నారు.

రామగుండం నేతల పనితీరుపై అధిష్ఠానం సంతృప్తి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చందుపట్ల సునీల్‌రెడ్డి

గోదావరిఖని, జూన్ 7: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో బీజేపీ వచ్చిన ఓట్ల విషయంపై శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి స్థానిక బీజేపీ కార్యాలయంలో రామగుండం అసెంబ్లీ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలోని ప్రతి బూత్ పనితీరుపై మండల అధ్యక్షులు, ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ఒక్కొక్క బూత్ నుండి ఓటింగ్ సరళి, వచ్చిన ఓట్లను ఓటు బ్యాంక్‌గా మలుచుకునే స్థాయి, తగ్గిన ఓట్లకు కారణాలు అడిగితెలుసుకున్నారు. దాన్ని రాబోయే స్థానిక ఎన్నికల్లో ఏ విధంగా అధిగమించాలని చూస్తున్నారు. అనే విషయాలను క్షుణ్ణంగా విచారణ చేశారు. 65బూత్‌లలో కాంగ్రెస్ కంటే బీజేపీకి ఎక్కువ ఓట్లు తెప్పించిన నాయకుల కృషిని అభినందించారు. సమీక్ష అనంతరం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి నాయకుల దగ్గరి నుంచి కిందిస్థాయి బూత్ నాయకుల దాకా ప్రతిఒక్కరూ శాయశక్తులా కష్టపడిన విధానం ఎన్నికల ఫలితాల్లో ప్రస్ఫుటమయ్యిందన్నారు. రాష్ట్ర అధిష్ఠానం రామగుండం పనితీరుపై సంతోషం వ్యక్తం చేసిందని సునీల్ రెడ్డితెలిపారు. ఆరు నెలల్లో 57 వేల మెజారిటీ పూర్తిగా తగ్గించి అది బీఆర్ఎస్ వైపు మరలకుండా చూసిన కందుల సంధ్యారాణి నాయకత్వాన్ని కొనియాడారు. బీజేపీ అర్బన్‌కే పరిమితం అనే ముద్రని అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని ప్రజలు పెద్దఎత్తున బీజేపీ వైపు నిలబడేలా చేసిన విధానం ఇలాగే కొనసాగించండి అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, కోఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్, మండల ఇన్‌చార్జి తోట కుమార్ స్వామి, సుల్వ లక్ష్మీనర్సయ్య, కోమల మహేష్, మండల అధ్యక్షులు కోడూరి రమేష్, గోపగోని నవీన్‌గౌడ్, మిట్టపల్లి సతీష్, గుండబోయిన భూమయ్య, బాణాల స్వామి పాల్గొన్నారు.

మోదీ మోసాలపై నిరంతర పోరాటం

- కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేశాం - పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, జూన్ 7: నరేంద్ర మోదీ మోసాలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాడుతామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. పెద్దపల్లిలో శుక్రవారం ఏర్పాటు మీడియా సమావేశంలో మాట్లాడారు. 10ఏళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజలకు ప్రధానిగా మోదీ ఏం చేశారని ప్రశ్నించారు. ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ యువతను మోసం చేశారని విమర్శించారు. యువశక్తిని నిర్వీర్యం చేసిన బీజేపీకి దేశంలో ఆదరణ తగ్గిందన్నారు. రాహుల్ గాంధీ యాత్ర ద్వారా చేసిన పోరాటం ఫలించిందన్నారు. రాహుల్ భావి భారత ప్రధాని కావడం ఖాయమన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు బీజేపీ అయోధ్య రామ మందిరం నిర్మాణం, అక్షింతల పేరిట ప్రజలను మతం పేరుతో ఆకర్షించేందుకు కుట్ర చేసి లబ్ధి పొందారని దుయ్యబట్టారు. ప్రధానిగా మోదీ దేశ ప్రజలకు చేసిన మేలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పూర్తిగా ఉనికిని కోల్పోయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి ప్రజలు మద్దతు తెలిపారన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. పెద్దపల్లిలో త్వరలోనే బైపాస్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు తెచ్చి భూసేకరణ, రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని, ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో 165 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 27 వేల 762 మంది రైతుల నుంచి రూ. 3 కోట్ల 92 లక్షల 26 వేల రూపాయలు విలువ చేసే 17కోట్ల 87లక్షల 101 క్వింటాళ్ల ధాన్యం కొన్నట్లు ప్రకటించారు. కొనుగోలు చేసిన రోజుల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 26వేల 852 మంది రైతులకు 3 కోట్ల 64లక్షల 33వేల రూపాయలు చెల్లించినట్లు పేర్కొన్నారు.సమావేశంలో భూషనవేని సురేష్‌గౌడ్, కడార్ల శ్రీనివాస్, జడ్పీటీసీ బండారి రాంమూర్తి, గోపగాని సారయ్యగౌడ్, నూగిల్ల మల్లయ్య, ఖతగడ్డ సంపత్, సయ్యద్ మాస్రత్, సందనవీని రాజేందర్, మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి, చిలుక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సుందిళ్ల పంపుహౌస్ రక్షణ గోడ పనులు నిలిపివేయాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సిరిపురం గ్రామస్థుల వినతి



మంత్రికి స్వాగతం పలుకుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్



మంత్రికి సమస్యలు వివరిస్తున్న సిరిపురం గ్రామస్థులు

మంథని/మంథనిరూరల్, జూన్ 7: సుందిళ్ల బ్యారేజీ సమీపంలోని సరస్వతి పంపుహౌస్ వద్ద రక్షణగా నిర్మిస్తున్న గోడ నిర్మాణం పనులను నిలిపివేయాలని సిరిపురం గ్రామానికి చెందిన పలువురు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి విన్నవించారు. మంత్రి సుందిళ్ల బ్యారేజీలో జరుగుతున్న రిపేర్ పనులు పర్యవేక్షించడానికి రాగా గ్రామస్థులు మంత్రి తమ సమస్యల ను వివరించారు. సరస్వతి పంపుహౌస్ వద్ద నిర్మిస్తున్న గోడ నిర్మాణం వలన వచ్చే వరద నీరు తమ గ్రామాన్ని ముంచే పరిస్థితి ఉందన్నారు. చందనాపూర్ వాగు నుంచి వచ్చే వరద ఈ గోడ నిర్మాణం వలన తమ గ్రామంలోకి వస్తే ముప్పు ఉంటుందని మంత్రికి వివరించారు. దీనిపై స్పందించి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. పంప్ హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని అంచనా వేసి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. అంతకు ముందు బ్యారేజీ సందర్శనకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ శశిభూషణ్‌కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్‌లు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

ఇటుక బట్టీలకు అక్రమంగా మట్టి రవాణా

- అడ్డుకున్న రంగాపూర్ గ్రామస్థులు



రంగాపూర్ గ్రామం వద్ద నిలిచిపోయిన టిప్పర్లు

పెద్దపల్లి రూరల్, జూన్ 7 : మండలంలోని రంగాపూర్, రాఘవపూర్ గ్రామాల పరిధిలోని ఇటుక బట్టీలకు మంథని మండలం బిట్టుపల్లి గ్రామ చెరువు నుంచి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారని, ఎలాంటి వే బిల్లులు లేవని శుక్రవారం రంగాపూర్ గ్రామం వద్ద గ్రామస్థులు మట్టి టిప్పర్‌లను అడ్డుకున్నారు. వే బిల్లుల లేకుండా మట్టిని తరలిస్తున్నారని, లారీ డ్రైవర్‌లతో గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. మట్టి తరలిస్తున్న అతివేగంగా వెళ్తున్నాయని, రోడ్డు మట్టి పెల్లలు పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. అధికారులు మట్టి టిప్పర్‌లను స్వాధీనం చేసుకొని రెవెన్యూ కార్యాలయానికి తరలిస్తుండగానే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మట్టి టిప్పర్‌లను వదిలేశారు. అక్రమ మట్టి దందా చేస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకడుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

బార్ అండ్ రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు

పెద్దపల్లిటౌన్, జూన్ 7: పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లను శుక్రవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో హోటల్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు రెస్టారెంట్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు ఈగలు రాకుండా జాగ్రత్త పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే కుళ్లిన ఆహార పదార్థాలు నిలువ ఉంచకుండా ప్రతిరోజు శుభ్రమైన ఆహారాన్ని కస్టమర్లకు విక్రయించాలన్నారు.స్వచ్ఛమైన తాగు నీటిని ప్రజలకు అందించాలని, హోటల్లో వ్యర్థపదార్థాలను నిల్వ ఉంచరాదని సూచించారు. నిత్యం మీ వద్దకు వచ్చే మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందించాలని మీ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన స్పష్టం చేశారు. హోటల్ యజమానులు నాణ్యమైన ఆహారాన్ని అందించని ఎడల వారిపై జరిమానాలు, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు రెస్టారెంట్లలో స్వాధీనం చేసుకున్న కుళ్లిన వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది భూమిలో పాతి పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ సంపత్ కుమార్, జూనియర్ అసిస్టెంట్లు డి.రమాకాంత్, సురేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మీనరసయ్యతో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ సునీత

హుజూరాబాద్‌రూరల్, జూన్ 7: హుజూరాబాద్ ప్రాంతంలో నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపై చర్యలు తీసుకుంటామని ఏడీఏ సునీత అన్నారు. అనుమతులు ఒక్క చోట తీసుకొని విత్తనాలను మరో చోట విక్రయిస్తున్న కంపెనీ ప్రతినిధిపై 6ఏ కింద శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు, వ్యవసాయాధికారులు తెలిపారు. మేడ్చల్ జిల్లాకు చెందిన శాంభవి ఆగ్రి సీడ్స్ ప్రతినిధి రాచపల్లి లింగయ్య మండలంలోని శాలపల్లి -ఇందిరానగర్ గ్రామంలోని రైతులకు 20 కిలోల విత్తనాల బ్యాగుల చొప్పున 141 బస్తాలు సుమారు 60 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు వ్యవసాయ శాఖ, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనుమతి ఒక చోట ఉంటే విత్తనాల విక్రయాలు మరోచోట జరిపినందుకు గాను సదరు కంపెనీ ప్రతినిధిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్, టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

10 నుంచి టీజీ పీఈసెట్

గణేశ్‌నగర్, జూన్ 7: తెలంగాణా ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024 (టీజీ పీఈసెట్)ను ఈ సంవత్సరం కూడా శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించ బడుతుందని కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ తెలిపారు. 2400 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరికి జూన్10 నుంచి 13వరకు శాతవాహన విశ్వ విద్యాలయం లోని క్రీడా మైదానంలో శరీర దారుఢ్య సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహించమన్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6:30 నుంచి బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పురుష అభ్యర్థులకు ఈనెల 10,11వ తేదీల్లో, మహిళా అభ్యర్థులకు 12,13వ తేదీల్లో శారీరక సామర్థ్య పరీక్షలు, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే దూర ప్రాంత విద్యార్థులకు యూనివర్సిటీలో వసతి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ఎస్‌యూ బీఎస్సీ హానర్స్ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూన్ 7: శాతవాహన విశ్వవిద్యాలయం బీఎస్సీ హానర్స్ రెండవ సెమిస్టర్‌కు సంబంధించిన తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 19 నుంచి 26 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

రేషన్ సరుకుల కోసం ఇబ్బందులు

- కిలోమీటర్ల దూరం వెళ్తున్న ప్రజలు
- తుర్తిలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వేడుకోలు

కథలాపూర్, జూన్ 7: రేషన్ సరుకులు మా పల్లెలోనే పంపిణీ చేయండి మహాప్రభో అని మొరపెట్టుకుంటే... లేదండీ మీకు నిబంధనలు వర్తించవు అనే అధికారుల సమాధానాలతో ఆ పల్లె జనం ఎదుర్కొంటున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ఏళ్ల తరబడి రేషన్ దుకాణాలు లేక కిలోమీటర్ల కొద్దీ దూరం నడిచి సరుకులు తెచ్చుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ ఇబ్బందులను పట్టించుకునే నాథుడే లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



తుర్తి గ్రామం

● హామీలు నెరవేర్చని నేతలు

మూడు మండలాల సరిహద్దుల్లో ఉన్న తుర్తి గ్రామంలో నేటికీ రేషన్ దుకాణం ఏర్పాటు చేయని కారణంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబారిపేటకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. ఇక్కడికి కేటాయించిన సరుకులను అంబారిపేటకు చెందిన డీలర్‌తో పంపిణీ చేస్తున్నారు. అధునాతన పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా సరుకులు పంపిణీ చేస్తుండగా ఈ పల్లెలో టెలికాం నెట్‌వర్క్ సమస్య కారణంగా విధిలేని పరిస్థితుల్లో వినియోగదారులు అంబారి పేటకు వెళ్లాల్సి వస్తోంది. అదేవిధంగా అంబారిపేట పరిధిలో ఉన్న గిరిజనులు రెండు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి సరుకులు తీసుకెళ్తున్నారు. వానాకాలంలో వినియోగదారులకు విపరీతమైన ఇక్కట్లు తప్పడం లేదు. ఆరు సంవత్సరాల కిందట చింతకుంటకు అనుబంధంగా ఉన్న రాజారాం తండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఇక్కడ కూడా నేటికీ రేషన్ దుకాణం మంజూరు చేయలేదు. దీంతో నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతకుంటకు విధిలేక సరుకుల కోసం వెళ్లక తప్పడం లేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 500 రేషన్ కార్డులు ఉంటేనే రేషన్ దుకాణం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందనే నిబంధనలు ఆ పల్లెవాసులకు గుదిబండగా మారిందనే ఆవేదన వెలిబుచ్చుతున్నారు.



ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదు

గ్రామపంచాయతీ ఏర్పడ్డ నాటి నుంచి రేషన్ దుకాణం మంజూరు చేయాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. గిరిజనులు సరుకుల కోసం పడుతున్న అవస్థలను వివరించి చెప్పినా వినిపించుకోలేదు. మారుమూల అటవీ ప్రాంతాల ప్రజల ఇబ్బందులను పట్టించుకోకపోవడం దారుణం.

- లావుడ్య రవీందర్, రాజారాం తండా

దుకాణాలు ఏర్పాటు చేయాలి

ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని దుకాణాలు ఏర్పాటు చేయాలి. మండల పరిషత్ సమావేశాల్లో పలు మార్లు ఈ సమస్యను ప్రస్తావించి అధికారుల దృష్టికి తెచ్చిన సందర్భాలున్నాయి. జనాభా, కార్డులతో సంబంధం లేకుండా గ్రామపంచా యతీకి రేషన్ దుకాణం విధిగా మంజూరు చేస్తూ కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.



- కోలకాని శేఖర్, మాజీ సర్పంచ్ తుర్తి

అటవీ భూముల ఆక్రమణ .. ఒకరిపై కేసు నమోదు

కోనరావుపేట, జూన్ 7: అటవీ భూములను ఆక్రమించేందుకు టేకు చెట్లతో సహా అన్నిటినీ నరికి వేస్తున్నారు. రెండు రోజుల క్రితం అధికారులు ఒకరిపై కేసు నమోదు చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో అక్రమార్కులు అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. కోనరావుపేట అటవీ ప్రాంతంలోని ఎగ్లాస్‌పూర్ ఎల్లమ్మ టెంపుల్ ఆవరణలోని అటవీ ప్రాంతంలో ఏకంగా మిషన్ల ద్వారా చెట్లను నరికి వేస్తున్నారు. అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారం రోజులుగా మిషన్‌లతో చెట్లను నరికి వేస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. చక్రాల వేణు అనే వ్యక్తిపై ఇప్పటికే అటవీ అధికారులు కేసు నమోదు చేశారు. అయినప్పటికీ చెట్లను నరికి వేస్తూ అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. చెట్లను నరికి వేస్తూ అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోనరావుపేట మండలవాసులు కోరుతున్నారు. అటవీ భూముల ఆక్రమణపై ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్‌ను వివరణ కోరగా చెట్లను నరికి వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే చక్రాల వేణుపై కేసు నమోదు చేశామన్నారు. మిషన్‌లతో చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అటవీ ప్రాంతంలో నరికిన చెట్లు

రెండు గ్రామాల మత్స్యకారుల మధ్య చేపల చెరువు వివాదం


చందుర్తి, జూన్ 7 : చేపల కోసం రెండు గ్రామాల మధ్య పంచాయతీ ఏర్పడింది. చందుర్తి మండలంలోని కట్టలింగంపేట, లింగంపేట గ్రామాల శివారులో గురునాథం చెరువు ఉంది. గతంలో కట్టలింగంపేటకు చెందిన గంగపుత్ర సంఘం మత్స్యకార్మికులు సొసైటీ ఏర్పాటు చేసుకొని మత్స్యకారులు కలిసి చేపలు పట్టుకునే వారు. వాటా(పాలు) పంచుకునేవారు. శుక్రవారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో కట్టలింగంపేటకు చెందిన మత్స్యకారులు గురునాథం చెరువులో చేపలు పట్టుకొని వచ్చారు. లింగంపేటకు చెందిన మత్స్యకారులు వెళ్లడంతో విషయం తెలుసుకున్న కట్టలింగంపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు చెరువు వద్దకు వెళ్లి తమ చెరువులో చేపలు పట్టవద్దంటూ అడ్డుకున్నారు. దీంతో రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారులు చెరువు మాదంటే, మాదే అనడంతో వివాదం తలెత్తింది. ఏడాది క్రితం కూడా వివాదం తలెత్తింది. గతంలో చెరువు సొసైటీ ఏర్పాటు చేసుకొని ఎవరైతే పట్టుకున్నారో వారే పట్టుకోవడానికి హక్కులు ఉంటాయని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. లింగంపేటకు చెందిన మత్స్యకారులు చెరువులో తమ పట్టా భూములు ఉన్నాయని చెప్పడంతో, సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.


ఇస్రో ఆన్‌లైన్ శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక


షరీఫ్ అహ్మద్

చిగురుమామిడి, జూన్ 7: మండలంలోని రామంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్ఎస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ శిక్షణకు ఎంపికయ్యా రని ప్రధానోపాధ్యా యుడు ఎస్ దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో నిర్వ హించే శిక్షణ కార్యక్రమానికి షరీఫ్ అహ్మద్ ఎంపిక కావడం సంతోకరమని పేర్కొన్నారు. దీని ద్వారా జాతీయ స్థాయిలో పాఠ శాలకు గుర్తింపు రావడం సంతోషకరమని తెలిపారు.







గత ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యంతోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీ నష్టం

- ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే మూడు బ్యారేజీల మరమ్మతులు
- పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి
- బ్యారేజీల నష్టంపై జ్యుడీషియల్ కమిటీ విచారణ
- తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని తప్పకుండా నిర్మిస్తాం
- రాష్ట్ర నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంథని/మంథనిరూరల్, జూన్ 7: గత ప్రభుత్వంలో పెద్దల నిర్లక్ష్యం తోనే కాళేశ్వరం ప్రాజెక్టు భారీ నష్టం జరిగిందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంథని మండలంలోని సుందిళ్ళ బ్యారేజీలో కొనసాగుతున్న మరమ్మతు పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని సుందిళ్ళ, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలను ఏజెన్సీల ద్వారా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. యుద్ధ ప్రాతిపదికన బ్యారేజీల్లో కొనసాగుతున్న రిపేర్ పనుల్లో ప్రతి పనికి నిర్దిష్ట సమయం నిర్దేశిం చుకుని వేగవంతంగా పూర్తి చేయాలి అధికారులకు సూచించారు. సుంది ళ్ళ బ్యారేజీ వల్ల స్థానికంగా వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మతు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తికావాలన్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి పనికి సమయాన్ని నిర్దేశించుకొని దానిలోపు ఆ పని పూర్తిచేసే విధంగా ఏజెన్సీలు పనిచేయాలని, ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితం పై షెడ్యూల్ రూపొందించి అందించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తూ ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదని, తాము అధికా రంలోకి వచ్చిన తర్వాత 3 బ్యారే జీల పునరుద్ధరణకు తీసుకోవాల్సి న చర్యలను సూచించాలని, దేశం లోనే పార్లమెంట్ ద్వారా ఏర్పాటు చేసిన అత్యున్నత సంస్థ అయిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీల కు బాధ్యత అప్పగించడం జరిగిం దన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మా ణంలో జరిగిన అవకతవకలను పరిశీలించేందుకు తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ జడ్జీ చంద్ర ఘోష్ ఆధ్వర్యంలో వేసిన జ్యుడీషియల్ కమిషన్ సైతం ప్రాజెక్టును సందర్శిస్తుం దన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని తప్పనిసరిగా నిర్మిస్తామన్నారు. ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సుందిళ్ల(పార్వతి) బ్యారేజ్ వద్ద కొట్టుకుపోయిన ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం జియో ఫిజికల్, జియో టెక్నికల్ జనరల్ పరీక్షలు నిర్వహించి కొట్టుకుపోయిన ఇసుకను అంచనా వేసి వాటిని పునరుద్ధరించి బ్యారేజీ సంరక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసి రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ, ఎస్ఈఎం. కరుణాకర్, ఈఈ సర్దార్ ఓంకార్ సింగ్, ఇతర నీటి పారుదల అధికారులు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, శశిభూషణ్‌కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చంద్రఘోష్‌ను కలిసిన అదనపు కలెక్టర్

జ్యోతినగర్, జూన్ 7: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విచారణ కమిషన్ చైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తి పి చంద్రఘోష్‌ను శుక్రవారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని వీజీపీ గెస్ట్‌హౌ స్(జ్యోతిభవన్)లో అ దనపు కలెక్టర్ జె అరుణశ్రీ కలిశారు. విచారణలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించిన తరువాత ఎన్టీపీసీకి వచ్చిన కమిషన్ చైర్మన్‌కు అదనపు కలెక్టర్ పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.


చంద్రఘోష్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న అదనపు కలెక్టర్

హత్యా.. ఆత్మహత్యా?

- అనుమానాస్పదంగా మృతి చెందిన జూనియర్ అసిస్టెంట్ - శరీరంపై గాయాలు
- సీసీ పుటేజీ పరిశీలించిన పోలీసులు - జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో విషాదం


రమేశ్(ఫైల్)


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 7: భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని రాంనగర్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. కాలనీలో నివాసముంటూ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుళ్లకోట గ్రామానికి చెందిన పంగ రమేశ్(50) అనే వ్యక్తి పట్టణంలోని రాంనగర్‌కాలనీ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. గతంలో వీఆర్ఏ, వీఆర్‌వోగా పనిచేసిన ఆయన వీఆర్‌వో వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రస్తుతం భూపాలపల్లి మునిసిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య రేణుక పిల్లలను తీసుకొని రెండు రోజుల కిందటే కరీంనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లగా రమేశ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తీసి ఉండటం, కోతులు ఇంట్లోకి చొరబడి చిందరవందర చేశాయి. దీంతో గమనించిన ఇంటి పక్కనున్న వారు కోతులను కొట్టేందుకు ఇంట్లో వెళ్లి చూడగా రమేశ్ విగత జీవిగా బాత్ రూమ్‌లో పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి ఇన్‌చార్జ్ సీఐగా ఉన్న చిట్యాల సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్సై ప్రసాద్ లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారి ని ఆరా తీశారు. కాగా, మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయి.

● అదుపులో ఇద్దరు వ్యక్తులు..?

ఈ ఘటన వివరాలు తెలియగానే సకాలంలో చేరుకున్న పోలీసు లు రమేష్ మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. విచారణను వేగవంతం చేసి మృతుడి ఇంటి ఎదుట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి అందులోని హార్డ్‌డిస్కును స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యుల్లోని ఓ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. కుటుంబ అవ సరాలకు పంగ రమేశ్ వారి బంధువుల వద్ద తీసుకున్న డబ్బుల విషయంలోనే గొడవలు జరిగి ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటా రనే చర్చ జరుగుతోంది. కాగా, పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తుండటం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

విచారణ తదుపరి వివరాలు వెల్లడిస్తాం..

- మల్లేష్‌యాదవ్, భూపాలపల్లి ఇన్‌చార్జి సీఐ

భూపాలపల్లి రాంనగర్‌లో జరిగిన ఘటనపై మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో విచారణ చేసిన పిదప వివరాలు వెల్లడిస్తాం. శరీరంపై గాయాలు ఉండటం మూలంగా హత్య చేసినట్లుగానే అనుమానిస్తున్నాం. త్వరలోనే నిజాలు తేల్చి హత్యా.. ఆత్మహత్యా. సాధారణ మరణమనేది చెబుతాం.

అగ్ని పర్వతంపై కరీంనగర్ మహిళ

కరీంనగర్ అర్బన్, జూన్ 7: అగ్ని పర్వతంపై మొదటిసారిగా భారతదేశానికి చెందిన ఇద్దరు మహిళలు అడుగుపెట్టి చరిత్ర సృష్టించారు. ఆ ఇద్దరిలో ఒకరు మహమ్మద్ పర్వీన్ సుల్తానా కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందినవారు. ఆసియా ఖండంలో ఏకైక అగ్ని పర్వతం అండమాన్ నికోబార్ దీవులలో బెరన్ ఐలాండ్‌లో ఉంది. ఆ అగ్ని పర్వతంపై మొదటిసారిగా ఇద్దరు మహిళలు అడుగుపెట్టారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సెస్, డె హ్రాడూన్, ఇస్రో వారి ప్రత్యేక పరిశోధన ప్రాజెక్టులో భాగంగా డాక్టర్ మమతా చౌహన్ సారథ్యంలో పరిశోధకుల బృందం అగ్ని పర్వతవం వద్దకు వెళ్లారు. ఆ బృందంలో ఒక రు రీంనగర్ కోతిరాం పూర్‌కు చెందిన మహమ్మద్ పర్వీన్ సుల్తానా. మే 29న బెరెన్ ఐలాండ్‌లోని అగ్ని పర్వతంపై ఆమె అడుగు పెట్టారు. ఈ పరిశోధనలో భాగంగా అగ్ని పర్వతం భౌగోళిక పరిణామాలు, శాస్త్రీయ విశ్లేషణ, అగ్ని పర్వత పనితీరు, ప్రకృతి విపత్కర పరిస్థితులపై అంచనా కోసం అక్కడ నుంచి వివిధ రకాల నమూనాలను సేకరించారు. అండమాన్ ఐలాండ్‌లోని డిగ్లీపూర్ నుంచి రంగౌత్ వరకు సుమారు వంద కిలోమీటర్లకు పైగా వివిధ ప్రాంతాలలో నమూనాలను సేకరించారు.


పర్వీన్ సుల్తానా



వివాహిత ఆత్మహత్యాయత్నం

మల్యాల, జూన్ 7: జగిత్యాలకు చెందిన ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్య యత్నం చేసుకుంది. రజిత అనే ఆశవర్కర్ శుక్రవారం ఉదయం మల్యాల మండలం నూకపల్లి శివారులో గల బావిలో దూకగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందిం చారు. దీంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది సంపత్ తదితరులు అక్కడకు చేరుకొని స్థానికులతో కలసి ఆమెను బావిలో నుంచి తీశారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు రజితను ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రమాదం ఏమీ లేదని తెలిసింది. ఆత్మహత్యయత్నంకు కారణాలు తెలియలేదు. ఫిర్యాదు రాలేదని ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

రైతుకు తీవ్ర గాయాలు

సైదాపూర్, జూన్ 7: సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన దాసరి గోపాల్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో ట్రాక్టర్ రోడ్డువేటర్‌తో భూమి చదును చేయిస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు వేటర్ మధ్య కాలు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కు టుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తన వ్యవ సాయ భూమిలో రోడ్డు వేటర్‌తో భూమి దున్నుతుంటే గోపాల్ వెనుక నుంచి ట్రాక్టర్ ఎక్కబోయి ప్రమాదవశా త్తు జారాడు. కాలు రోడ్డు వేటర్లో పడడంతో తెగిపోయిం ది. గోపాల్‌ను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి, జూన్ 7 : చందుర్తి మండలం లింగంపేట లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. లింగంపేట గ్రామంలో బోజ సుభాష్ అక్రమంగా రేషన్ బియ్యం ఓ ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేశారు. ఇంట్లోని ఓ గదిలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేసి ఉండగా సీజ్ చేశారు. ఈ ఘటనలో సుభాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న బియ్యాన్ని అక్రమంగా తరలించడం నేరమని తెలిపారు.

డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, జూన్ 7: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటు కళాశా లల్లో రెండు సంవత్సరాల కోర్సులైనా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) మొదటి సంవత్సరము 2004-25లో చేరేందుకు నిర్వహించే డీఈఈ సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైందని ఎల్ఎండీ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. షెడ్యూల్ తెగల, షెడ్యూల్ కులాలు, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబరు 1,2024 నాటికి 17 సంవత్సరాల వయస్సు ఉండాలని గరిష్ఠ వయో పరిమితి లేదని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జూలై 10వ తేదీన ఉంటుందని తెలిపారు. డీఈఎల్ ఈడీ కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుందని పేర్కొన్నారు. డీపీఎస్ఈ మాత్రము కేవలం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని తెలిపారు. వివరాలకు డీఈఈసెట్-2024 వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు.

ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

మానకొండూర్, జూన్ 7: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన రౌడీ షీటర్ గోపు ప్రశాంత్‌రెడ్డి హత్య కేసులో మరో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసిన ట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పచ్చునూర్‌లో భూ వివాదంలో రమేశ్, ప్రశాం త్‌రెడ్డి ఇద్దరు రౌడీషీటర్ల మధ్య గొడవలు ముదిరి మే 28న హత్యకు తీశాయని తెలిపారు. హత్య జరిగిన అనంతరం 11 మంది పరారు కాగా ఇందులో ప్రధాన నిందితుడితో పాటు మరో 8మందిని ఈ నెల 4న పోలీసులు అరెస్టు చేశారు. కాగా. మరో ఇద్దరు గాజు శంకర్, మద్దెల వెంకటేశ్‌లు తప్పించుకోగా శుక్రవారం మండల కేంద్రంలో వారిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రూ. 1.40 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సైదాపూర్, జూన్ 7: సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న చట్ల ఆంజనేయులు అనే కానిస్టేబుల్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కాడు. తన ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు డ్రా చేసుకున్నారని బాధితుడు ఆంజనేయులు గురువారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. సైబర్ నేరగాళ్లు గత నెల 30న ఆంజనేయులు సెల్‌కు కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్టు చేసినంతలో ఆంజనేయులు సెల్‌కు ఓటీపీ వచ్చింది. కొంత సేపటికి ఆంజనేయులు సెల్ బ్లాక్ అయింది. కొత్త సిమ్ తీసుకునేంతలోపు ఆంజనేయులు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు డ్రా చేసుకున్నారు. తన సిమ్ ఆక్టివేట్ అవగానే ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు ఆంజనేయులుకు మెస్సేజ్‌లు వచ్చాయి. ఖాతాలో ఉన్న రూ.1.93లక్షల నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 1.40లక్షలుడ్రా చేశారని గుర్తించాడు. దీంతో కానిస్టేబుల్ తన ఖాతాను బ్లాక్ చేపించాడు. గురువారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జూన్7: కుటుంబ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని ఏడు సంవత్సరాల బాలికపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టిన నేరంలో నిందితుడు కారుపాక రాజ్‌కుమార్(20)కు 20 ఏళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకటేష్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన వివాహితకు భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బతుకుదెరువు కోసం భర్త పిల్లలతో కలిసి వచ్చి హుజూరాబాద్‌లోని గ్యాస్ గోదాం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కొన్నాళ్లకు భర్త అనారోగ్యంతో చనిపోగా ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నది. వీణవంక మండలం పోతిరెడ్డి పేటకు చెందిన కారుపాక రాజ్‌కుమార్ తల్లితో కలిసి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. వివాహిత కుటుంబంతో రాజ్‌కుమార్‌కు పరిచయం ఉన్నది. దీన్ని ఆసరా చేసుకున్న రాజ్‌కుమార్ ఆమె పెద్దమ్మాయికి మాయమాటలు చెప్పి 2020 ఆగస్టు 8న మధ్యాహ్నం తన ఇంటికి తీసుకువెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. మరుసటి రెండు రోజులు కూడా అత్యాచారం చేసి ఎవరికీ చెప్పొద్దని బెదించాడు. రెండు రోజుల తరువాత బాలికకు తల్లి స్నానం చేయిస్తుండగా అమ్మాయి పరిస్థితి చూసి ఏమి జరిగిందని ఆరా తీయగా విషయం మొత్తం తల్లికి వివరించింది. బాలిక తల్లి హుజూరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటికి సీఐ మాధవి రాజ్‌కుమార్ పై కేసు నమోదు చేశారు. మరో సీఐ ఎస్ శ్రీనివాస్‌రావు ఈ కేసు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాజిక్యూటర్ జూలూరి రాములు విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి నిందితుడు రాజ్‌కుమా ర్‌కు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అంజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.1.09 కోట్లు


హుండీ సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, జూన్ 7: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.1,09,62,169 నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. 34 రోజులకు ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 44గ్రాముల మిశ్రమ బంగారం, 3.800కిలోల మిశ్రమ వెండి, 41విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో వరంగల్ డీసీ సంజీవరెడ్డి, ఏఈవో వై. అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీ లలిత సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 7 : మండలంలోని హుస్సేన్‌మియా వాగునుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని మట్టి రవాణను అరికట్టాలని శుక్రవారం పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు పెద్దబొంకూర్ ఎంపీటీసీ మిట్టపల్లి వసంత -వెంకటేషం వినతిపత్రం అందించారు. వాగు నుంచి ఇసుకతో పాటు, మట్టిని కొందరు తరలిస్తున్నారని దీంతో ఇరువైపులా రైతులకు భూగర్భజలాలు అడుగంటే అవకాశాలు ఉన్నాయని వినతిలో పేర్కొన్నారు. వెంటనే అక్రమ దందాదారులపై కొరడా ఝులిపించాలని తహసీల్దార్‌ను కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లి రూరల్, జూన్ 7 : పెద్దపల్లి మండలంలోని రాగినేడు సబ్‌స్టేషన్ పరిధిలోని రాగినేడు, కనగర్తి, కాపులపల్లి, అందుగులపల్లి, బ్రాహ్మణపల్లి, కుర్మపల్లి గ్రామాల్లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8.30 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

ధర్మారం, జూన్ 7: ధర్మారం సబ్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం, మల్లాపూర్ సబ్‌స్టేషన్‌లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఖాశీం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముత్తారం జూన్ 7: మండలంలోని ముత్తారం, లక్కారం అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో సరఫరా నిలిచిపోతుందని ఏఈ హనుమాన్‌దాస్ తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా సరఫరా ఉండదని తెలిపారు.

ఖమ్మంపల్లిలో ఇసుక వేలంపాట

ముత్తారం జూన్ 7: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మానేరుశివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుమన్ పేర్కొన్నారు. 60ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను రూ. 1,13,400 వేలం వేయనున్నట్లు అయన తెలిపారు. ఆసక్తిగల వారు తహసీల్దార్ కార్యాలయంలో రూ.5000 డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలని, వేలంపాట ఈనెల 11న నిర్వహించనున్నట్లు తెలిపారు.

'తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వం'

పెద్దపల్లిటౌన్, జూన్ 7: రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రదీప్ కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ పటిష్ఠమైన నాయకత్వాన్ని, సమర్థపాలను చూసి ఓట్లు వేసిన పెద్దపల్లి ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు, నాయకులు తాత రవి, దాడి సంతోష్, తంగెడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు, సంతోష్‌రెడ్డి తదితరులున్నారు.

పనులు వేగవంతం చేయాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 7 : గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న పనులను పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలు ప్రారంభంలోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. వెంట ఏపీవో రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు హన్మంతు, టిప వెంకటేష్ ఉన్నారు.

ఆర్‌టీసీ డిపోలో మెగా హెల్త్ చాలెంజ్

కళ్యాణ్‌నగర్, జూన్ 7: గోదావరిఖని ఆర్‌టీసీ డిపోలో శుక్రవారం మెగా హెల్త్ చాలెంజ్ నిర్వహించారు. జనరల్ ఫిజిషియన్ వైద్యులు రాజశేఖర్‌రెడ్డి, గైనకాలజిస్ట్ లక్ష్మీవాణి హాజరై ఉద్యోగులందరికి మెడికల్ కన్సల్టేషన్ నిర్వహించారు. కార్మికుల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారి మెడికల్ రిపోర్టులను పరిశీలించారు.

డబుల్ రోడ్డు కోసం వినతి

జూలపల్లి, జూన్ 7 : జూలపల్లి డబుల్ రోడ్డు పనులు ప్రారంభించి మండల ప్రజల బాధాలను తొలగించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన సామాజిక నాయకులు మారం తిరుపతియాదవ్ శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. గత ఎన్నో ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన సింగిల్‌రోడ్డు శిథిలమైపోయి గుంతలుగా మారడంతో రోడ్డు గుండా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే డబుల్ రోడ్డు పనులను చేపట్టాలని అలాగే ఈ డబుల్‌రోడ్డును కాళేశ్వరం, కామారెడ్డి రోడ్లకు అనుసందానం చేస్తూ రాష్ట్ర రహదారిగా గుర్తింపు వచ్చేలా అభివృద్ధి చేయాలని తిరుపతియాదవ్ వినతిపత్రంలో కోరారు. అలాగే డబుల్‌రోడ్డు పనులు ప్రారంభించాలని లేనిచో ఆందోళన చేపడతామని కోరుతూ మండల బిజేపి నాయకులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



డీజిల్ టాప్ లోడింగ్ ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 7: ఓసీపీ-1లో ఇండి యన్ ఆయిల్ బంక్‌లో ఆధునీకీకరించిన డీజిల్ టాప్ లోడింగ్ పాయింట్‌ను శుక్రవారం డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్ ప్రారంభించారు. డీజిల్ బంక్ సామర్థ్యం 119 కిలోలీటర్ల నుంచి 154 కిలోలీటర్లకు పెంచి నట్టు డైరెక్టర్ తెలిపారు. ప్రాజెక్టులోని భారీ యంత్రాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక టెక్నాలజీతో డీజిల్ బంక్ సామర్థ్యాన్ని పెంచినట్టు ఆయన పేర్కొన్నారు. అనంతరం వ్యూపాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలించారు. నూతనంగా ప్రారంభంకానున్న ఓసీపీ-1 విస్తరణ కోసం ప్రతిపాదనలు, సర్వే చేసిన ప్రాంతాన్ని మ్యాప్ ద్వారా డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ పరిశీలించారు. డైరెక్టర్ వెంట సీజీఎం(ఐటీసీఎల్, ఐటీ) కమల్ షీల్, ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, పీఈ శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్ హరిజన్, డీజీఎం స్టోర్స్ ఉదయ్‌భాస్కర్ ఉన్నారు.

ఓసీపీ-1 ఓబీ కంపెనీలో ప్రమాదం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 7: ఓసీపీ-1 ప్రాజెక్టు పరిధిలో ఓబీ వెలికితీత పనులు నిర్వహిస్తున్న హెచ్‌డీ కంపెనీలో శుక్రవారం ఓల్వా వాహనం బోల్తాపడింది. ఓబీమట్టిని అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో వాహనం ఓబీ కుప్పలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బటపడ్డాడు.

మూడో రోజుకు చేరిన సమ్మె

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 7: సింగరేణి భూనిర్వాసిత అద్దె వాహన యజమానుల సమ్మె మూడవ రోజు కొనసాగింది. గురువారం అద్దెవాహన యజమానులను సింగరేణి యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. కాగా యజమానుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. సమ్మెను కొనసాగించాలని, శాంతియుత పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు భూనిర్వాసిత అద్దె వాహన యజమానులు పేర్కొన్నారు.

సీబీఎస్‌సీ సిలబస్ ప్రవేశపెట్టాలి

రామగిరి, జూన్ 7: సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్సీ సిలబస్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు మోల్పూరి శ్రీనివాస్ ఆర్జీ-3 పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సెంటినరీ కాలనీ, ప్రభావిత ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యనందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తీగల శ్రీధర్, శ్రీకాంత్, దొంతుల సురేష్, తొట్టరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా విద్యాశాఖాధికారి మాధవి



కాల్వశ్రీరాంపూర్‌లో పాల్గొన్న డీఈవో మాధవి



నర్సాపూర్‌లో బడిబాట ర్యాలీ

కాల్వశ్రీరాంపూర్, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయని డీఈవో మాధవి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలు ఉన్న ఇండ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించాలని కరపత్రాల ద్వారా డీఈవో మాధవి వివరించారు. ఫ్లెక్సీలతో గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వ విద్యా సౌకర్యాలను వివరించారు. అనంతరం ఎస్‌సీ కాలనీ ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం కలిగిన అధ్యాపకుల చేత శాస్త్రీయ విద్యా విధానంలో బోధన చేయిస్తున్నామని, బడి ఈడు కలిగిన పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో కోరారు. పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై మోజు వీడాలని, ఫీజుల రూపంలో చెల్లించే డబ్బును పిల్లల పేరు మీద ఫిక్స్ డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, దానికి ఉదాహరణ తామేనన్నారు. అన్ని హంగులతో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించి, ఉచితంగా నాణ్యమైన విద్యా సౌకర్యాలను పొందాలని పిల్లల తల్లిదండ్రుల్ని డీఈవో కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, ఎంపీడీవో రామ్మోహనచారి ఎంపీవో గోవర్ధన్, ఎంఈవో సురేందర్ కుమార్, ఎంఎన్‌వో సిరిమల్ల మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జూన్ 7 : పాఠశాలలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా ప్రభుత్వం బడిబాట కార్యక్రమం నిర్వహించగా గ్రామాల ప్రజలు ఇళ్లల్లో లేకపోవడంతో ఉపాధిహామీ పనుల వద్దకే ఉపాధ్యాయులు వెళ్లి ప్రచారం చేపడుతున్నారు. ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య సుదుపాయాలు కల్పిస్తున్నామని వివరిస్తున్నారు. శుక్రవారం మండలంలోని మూలసాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో తల్లిదండ్రులు లేకపోవడంతో ఉపాధ్యాయులంతా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల వద్దకు వెళ్లి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జావిద్, శ్రీదేవి, పంచాయతి కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు రమణయ్య, సంజీవ్, సదానందం, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

ఓదెల, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు బడిబాటలో భాగంగా గ్రామాల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం వారి ఇంటి బాట పట్టారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, భోజనం, క్రీడ మైదానాల సదుపాయాలపై, అలాగే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్య బోధన ఉందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఆర్థిక నష్టాలకు గురికాకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి పాఠశాలలను కాపాడుకోవాలని ఉపాధ్యాయుల కోరారు. ఓదెలతో పాటు కనగర్తి, కొలనూర్ తదితర గ్రామాల్లో ప్రతి ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. అలాగే అవగాహన కోసం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మ, గైని రమేష్ లక్ష్మి, ఉపాధ్యాయులు శారద, వంశీకృష్ణ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, జూన్ 7 : బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం పులి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల నుంచి అంబేడ్కర్‌చౌక్ గుండా బీసీ కాలనీలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 5నుంచి 15ఏళ్ల బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. ఈ నెల 19వరకు బడిబాట కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సీఆర్‌పీ లక్ష్మీనారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ విమల, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, మంజుల, భవాని, అంగన్వాడీ టీచర్లు హేమలత, సూర్యకళ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, జూన్7: గోదావరిఖని వినోభానగర్, సీతానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చిన్నారుల తల్లుల సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమున మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తిరుమల, ఆయా కె.రాజేశ్వరి పాల్గొన్నారు.



ఓదెలలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయ బృందం



విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సారంగపాణి

రాష్ట్ర స్థాయిలో పోటీల్లో కమాన్‌పూర్ విద్యార్థినికి సిల్వర్ మెడల్

కమాన్‌పూర్, జూన్ 7 : మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి శంకర్-భారతిల కుమార్తె నల్లవెల్లి ఆనంది ఈనెల 6న హన్మకొండలోని జవహర్‌లాల్ నేహ్రూ స్టేడియంలో 10వ తెలంగాణ స్టేట్ యూత్ బాయ్స్ అండ్ గర్ల్స్ స్టేట్ చాంపియన్‌షిప్ అండర్-16 పోటీల్లో సిల్వర్ మోడల్ సాధించింది. ఈ మేరకు రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి చేతుల మీదుగా విద్యార్థి సర్టిఫికెట్, మెడల్ అందజేశారు. ఈ మేరకు జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి గట్టయ్య శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక అంశాలపై అవగాహన

కమాన్‌పూర్, జూన్ 7 : మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందం సభ్యులు వివిధ సామాజిక అంశాలపై ప్రజలకు శుక్రవారం పాటల రూపంలో అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన, బేటి బచావో.. బేటి పడావో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కొండ్ర వెంకన్నగౌడ్, జనగామ రాజనర్సు, పద్మ, మల్లేష్‌గౌడ్, బుర్ర శంకర్ గౌడ్, నలేంద్ర రాజన్న, రమా, రేణుక తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 7 : పాఠశాలలు ప్రారంభంలోపు పెండింగ్ బిల్లులు పూర్తిగా చెల్లించాలని, మధ్యాహ్న భోజన వర్కర్స్‌కి రూ.10వేల వేతనం అమలుచేయాలని మధ్యాహ్న భోజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లా మధ్యాహ్న భోజన వర్కర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి కావాల్సిన వంట పాత్రలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం అందించుటకు సరుకులు, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు బండారి వసంత, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓదెల రమేష్, ఉపాధ్యక్షురాలు పాతకుల కళావతి, సహాయకార్యదర్శి ధరణి సుమలత తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన వర్కర్స్‌తో మాట్లాడుతున్న రమేష్

మరమ్మతులకు నోచుకోని నీటి శుద్ధి కేంద్రాలు

పాలకుర్తి, జూన్ 7: లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాలు మూలనపడ్డాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2004లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రామగుండం మండలంలోని పెద్దంపేట, ప్రస్తుత పాలకుర్తి మండలంలోని బసంత్‌నగర్, జయ్యారం గ్రామాల్లో లక్షలాది రూపాయలను వెచ్చించి నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా శుద్ధమైన తాగునీటిని అందించారు. వాటి నిర్వాహణను ఆయా గ్రామపంచాయతీలకు అప్పగించారు. మరోవైపు బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ సైతం బసంత్‌నగర్, పుట్నూర్, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లో నీటి కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వాటికి మరమ్మతులు రావడంతో గ్రామపంచాయతీలు, అధికారులు, కేశోరాం యాజమాన్యం పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో నీటిశుద్ధి కేంద్రాలు మూలనపడ్డాయి. దీంతో ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకొని కొందరు మినరల్ వాటర్ ప్లాంట్లను నెలకొల్పి అందినంత దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, కేశోరాం యాజమాన్యం తగిన చర్యలు చేపట్టి తమకు తాగునీరు అందించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జయ్యారంలో మూలనపడ్డ నీటిశుద్ధి కేంద్రం



పుట్నూర్‌లో మూలనపడ్డ నీటిశుద్ధి కేంద్రం

ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి

- నాబార్డు ఏజీఎం జయప్రకాష్



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

జూలపల్లి, జూన్ 7 : ప్రస్తుత కాలంలో ఫ్యాషన్ డిజైన్‌లో శిక్షణ పొందిన మహిళలకు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని నాబార్డు ఏజీఎం జయప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలో నాబార్డు సహకారంతో అడ్వాన్స్‌డ్ ఫ్యాషన్ డిజైనింగ్‌తో ఇరువై రోజులుగా స్పందనా సేవా సొసైటీ సంస్థ ద్వారా శిక్షణ పొందిన 70మంది మహిళలకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు ప్రత్యేక కార్యక్రమంలో వారికి సర్టిపికెట్లతోపాటు ఒక్కొరికి 750 రూపాయల స్టైపండ్‌ను ఏజీఎం జయప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా మహిళల కోసం అందించే ప్రతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైల్డ్ కమిషన్ మెంబర్ శోభారాణి, జూలపల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్ సురేష్, సంస్థ కోఆర్డినేటర్లు గౌతమి, స్వాతి, శిక్షకులు సత్యవతి, సత్య, కవితలతో పాటు శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

10 న సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిటౌన్, జూన్ 7: దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం ఈ నెల 10న మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు, తాత్కాలిక సదరం సర్టిఫికెట్ ఉన్నవారు రెన్యువల్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మానసిక అంగవైకల్యం, బుద్ధిమాంద్యం ఉన్న వారు జూన్ 13న నిర్వహించే క్యాంపునకు స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్నవారు జూన్ 20న నిర్వహించే క్యాంప్ కోసం, శారీరక అంగవైకల్యం గల వారు జూన్ 27 క్యాంప్ స్లాట్ కొరకు జూన్ 10న ఉదయం 11.35 గంటల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ నమోదు చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుకింగ్ అనంతరం మెడికల్ క్యాంపులకు వచ్చే సందర్భంలో దరఖాస్తుదారులు మీసేవ సదరం స్లాట్ బుకింగ్ రసీదుతో పాటు వికలాంగత్వ పరీక్ష కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్ట్‌లను వెంట తీసుకొని రావాలని డిఆర్‌డిఓ ఆర్.రవీందర్ తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కోల్‌సిటీటౌన్, జూన్ 7: భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని నిరుపేద విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ట్రస్మా నాయకులు అరుకాల రాంచంద్రారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు జక్కుం శ్రీనివాస్ చేతుల మీదుగా ఐదుగురు విద్యార్థులకు నోట్‌బుక్స్ పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భరోసా సంస్థ అధ్యక్షురాలు నసీమాబేగం, పేద విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

కోల్‌సిటీటౌన్, జూన్7: సింగరేణి ఆర్జీ-3లోని ఓసీపీ-1లో ఈపీ ఆపరేటర్‌గా ఉద్యోగ విరమణ చేసిన కళాకారుడు, క్రీడాకారుడు పోతుల చంద్రపాల్‌ను పలు సంఘాలు సన్మానించాయి. స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్, నియర్ అండ్ డియర్, రామగుండం కళాకారుల సంక్షేమ సంఘం, గోదావరి సరిగమలు, రామగుండం ఏరియా యూట్యూబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని దుర్గానగర్‌లో జరిగిన ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో మేజిక్ రాజా, అమరేందర్, దయానంద్‌గాంధీ, దామెర శంకర్, సంజయ్‌కుమార్, వేల్పుల మురళీధర్ యాదవ్, గట్టయ్య, వెంకటస్వామి, అందె సదానందం, మేజిక్ హరి, మాదరి వాసు, అంజయ్య, సోగాల వెంకటి, మూలశంకర్, మంథని సంపత్, రాజేశ్వర్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

ఓదెల, జూన్ 7: ఓదెల మండలజ జీలకుంటలో గురువారం రాత్రి నల్ల శ్రీనివాస్‌రెడ్డి (41) అనే రైతు విద్యుదాఘాతంతో దుర్మరణం చెందారు. శుక్రవారం పొత్కపల్లి ఎస్ఐకి మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటిలో ఉన్న మీటర్‌లోకి విద్యుత్ రాకపోవడంతో బయట ఉన్న స్తంభం వద్దకు వెళ్లి పరిశీలించాక కార్బన్ రావచ్చనే ఉద్దేశంతో కర్రతో పైన ఉన్న విద్యుత్ కేబుల్‌ను కదిలించాడన్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ కేబుల్ ఎడమచేతి బొటనవేలు, మధ్య వేలుకు తగలగానే పక్కనున్న రాళ్లపైన పడిపోయాడని పేర్కొన్నారు. వెంటనే మృతుని భార్య కేకలు వేయడంతో బంధువులు వచ్చి కొన ఊపిరితో ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

శరీర దానానికి ఖని దంపతుల అంగీకారం



అంగీకార పత్రాలను అందజేస్తున్న దంపతులు

కోల్‌సిటీటౌన్, జూన్ 7: గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ సీనియర్ మైనింగ్ సూపర్‌వైజర్ బత్తుల చక్రపాణి-మంగమ్మ దంపతులు తమ మరణానంతరం పార్థివదేహాలను వైద్య విద్య నిమిత్తం కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కి అందించేందుకు ముందుకువచ్చారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులకు దంపతులు అంగీకార పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు కొన్ రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కరేటి శంకర్‌రావు, భూపాల్‌పల్లి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి ,సభ్యులు బామాండ్ల పెళ్ళి మల్లయ్య పాల్గొన్నారు.

మెరుగైన సమాజ నిర్మాణం కోసం మేధోమథనం

పెద్దపల్లిటౌన్, జూన్ 7: మెరుగైన సమాజం కోసం మేధో మథనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్ల శంకర్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహనీయుల ఆశయ సాధనలో భాగంగా ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ నెంబర్ 542 ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేధావులతో మేథోమథన కార్యక్రమాన్ని గాయత్రి జూనియర్ కళాశాల పెద్దపల్లిలో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటస్వామి, క్యాదాసి రాజేశం, వెంకటేశం, రాజన్న, తిరుపతి, మామిడిపల్లి బాపన్న, సందీప్, రవి, స్వామి, దినేష్, రాజేందర్ పాల్గొన్నారు.

'గ్రామ పంచాయతీ తీర్మానం ఇస్తే రూ.15లక్షల నిధులు'

ఓదెల, జూన్ 7: ఓదెలలో జీపీ తీర్మానం ఇచ్చినట్లయితే ఇక్కడి వారసంత అభివృద్ధికి రూ.15లక్షల నాబార్డు నిధులు సిద్ధంగా ఉన్నాయని ఆర్డీఎస్ నిర్వాహకులు నోముల సదాశివరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని కూరగాయల వారసంతకు వెచ్చించాల్సిన నాబార్డు నిధులు రూ.15 లక్షల మేరకు మరో ప్రాంతానికి వెళ్లే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామీణ స్థాయిలో చిరు వ్యాపారాలతో మహిళ అభివృద్ధిని పెంపొందించేందుకు నాబార్డు ముందుకు వచ్చిందని, ఈ మేరకు గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు గాని అధికారులు గానీ సహకరిస్తే వారసంతలు అభివృద్ధి జరుగుతాయని తెలిపారు. నాలుగేళ్ల క్రితం ఇక్కడ మహిళలకు శిక్షణ తరగతులు కూడా నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం ఇక్కడి వారసంతను కూడా మరింత అభివృద్ధి చేసేందుకు నాబార్డు నుంచి అధికారి జయప్రకాష్ పరిశీలించారని తెలిపారు. కేవలం గ్రామ పంచాయతీ తీర్మానం కావాలని కోరినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదని తెలిపారు. ఇప్పటికైనా జీపీ తీర్మానం ఇవ్వాలని అనంతరం ప్రణాళికల మేరకు వారసంతలు అభివృద్ధి పనులు జరుగుతాయని పేర్కొన్నారు. వెంటనే మాజీ ప్రజాప్రతినిధులు, ప్రత్యేక పాలన అధికారులు ముందుకు రావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముత్తారం, జూన్ 7: లక్కారం గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ, అత్తే చంద్రమౌళి హాజరయ్యారు. 18 సంవత్సరాల క్రితం తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను ఒకే వేదికపై వారిని ఏకం చేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ గత స్మృతులను నెమరువేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాల తీపి కబుర్లు, తమ అనుబంధాలను స్మరించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.